క్లుప్తంగా

ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో నిర్లక్ష్యం వద్దు


రాకొండలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గ్యామా

దోమ: ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహించరాదని ఎంపీడీఓ గ్యామా సూచించారు. సోమవారం మండల పరిధిలోని రాకొండ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు త్వరితగతిన బిల్లులు చెల్లిస్తుందని, నిర్మాణంలో నిర్లక్ష్యం వహించకుండా తొందరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. విడతల వారీగా బిల్లులు వస్తున్నాయని, ఏ లబ్ధిదారుడు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్‌గా జగదీశ్‌యాదవ్


కమిటీ చైర్మన్, సభ్యులతో గ్రామస్తులు

మర్పల్లి: కొంషెట్‌పల్లిలోని హిందూ ఆలయాల కమిటీ చైర్మన్‌గా గొల్ల జగదీశ్‌యాదవ్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు వీరేశంగౌడ్, నవీన్, మైపిపాల్, నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విరాళం అందజేత


హిందూ ఉత్సవ కేంద్ర సమితికి విరాళాన్ని అందజేస్తున్న విఠల్‌నాయక్

తాండూరు టౌన్: తాండూరు హిందూ ఉత్సవ కేంద్ర సమితికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్ రూ.51 వేల విరాళం అందజేశారు. ఈ మేరకు సోమవారం ఆయన సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సిములు, కోశాధికారి రొంపల్లి సంతోష్ కుమార్ తదితరులకు నగదును ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో హిందూ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహించే హిందూ సంస్కృతి, సంప్రదాయ కార్యక్రమాలకు తన వంతు సాయం అందజేస్తానన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు రామకృష్ణ, పరమేశ్వర్, ప్రసాద్, వెంకట్, నర్సింహ, లోకేష్, కుమార్‌వాల్మీకి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి


వీరభద్రేశ్వర ఆలయంలో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి శివారులో ఉన్న పురాతన వీరభద్రేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని దేవాలయ కమిటీ సభ్యులు అన్నారు. సోమవారం ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన వంటగది, కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో సారంగధర శెట్టి రామలక్ష్మమ్మ వంటగది, జొన్నల బస్వరాజ్–సుజాత, జొన్నల వినోద్‌కుమార్–శివజ్యోతి, రుషికేష్‌ల సహకారంతో కార్యాలయాన్ని నిర్మించారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బస్వరాజ్, శివకుమార్, వినోద్‌కుమార్, పురుషోత్తంరెడ్డి, శ్రవణ్‌కుమార్, వీరేశం, రంజిత్‌కుమార్, వీరయ్యస్వామి, జితేందర్‌రెడ్డి, రాంచంద్రి, నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అలుగు వద్ద ప్రత్యేక పూజలు


పూజలు చేసేందుకు బయలుదేరిన గ్రామస్తులు

కేశంపేట: మండల పరిధిలోని పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల పరిధిలో ఉన్న పెద్దచెరువు ఇటీవల కురుస్తున్న వర్షాలకు అలుగు పారుతుండడంతో సోమవారం గ్రామస్తులు చెరువు కట్టపైన ఉన్న మైసమ్మ, గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. వ్యవసాయానికి నీటి ఇబ్బందులు ఉండవని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పల్లె అనంద్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు భారీగా చెరువు కట్ట వద్దకు చేరుకొని పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజు, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, శివకుమార్ పాల్గొన్నారు.

వామ్మో.. కుక్కలు!


దుద్యాల్ గ్రామ ప్రధాన చౌరస్తాలో శునకాల సమూహం

- గ్రామాల్లో పెరుగుతున్న వీధి శునకాల బెడద
- ఇటీవల ఏడుగురిపై దాడి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

దుద్యాల్: వీధి కుక్కల బెడదతో గ్రామాల్లో ప్రజలు అడుగుబయట పెట్టాలంటే హడలెత్తిపోతున్నారు. వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ కనిపించిన వారిపై తమ ప్రతాపాన్ని చూపుతున్నాయి. ఎటువైపు నుంచి వచ్చి శునకాలు దాడి చేస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లోని వీధుల గుండా కుక్కలు గుంపులు గుంపుగా తిరుగుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. హస్నాబాద్, దుద్యాల్, లగచర్ల, హకీంపేట్ తదితర గ్రామాల్లోని వీధి శునకాల సంఖ్య పెరిగిపోయింది. విచ్చల విడిగా తిరుగుతున్నా.. గ్రామ పంచాయతీ అధికారులు మాత్రం మాకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. నిత్యం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, మార్కెట్‌కు వెళ్లే మహిళలు గ్రామ సింహాలను చూసి జంకుతున్నారు. ఆదివారం కొడంగల్ నియోజకవర్గం కేంద్రంలో ఆరుగురికి కుక్కలు కాటేయగా.., దుద్యాల్ మండల పరిధిలోని హస్నాబాద్‌లో శనివారం ఓ వ్యక్తిని కుక్క కాటు వేసింది. కుక్కలు కాటు వేసిన బాధితులు హైదరాబాద్‌లోని ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. మూడు నెలల వ్యవధిలో మండలంలో దాదాపు 10 వరకు కుక్క కాటు కేసులు సంభవించాయి. దీంతో గ్రామాల్లో ప్రజలు కుక్కలను చూస్తే చాలు భయంతో పరుగులు పెడుతున్నాయి.

నియంత్రించాలి



గ్రామాల్లో వీధి కుక్కలను నియంత్రించాలి. నా భర్తను శునకాలు శనివారం కరిశాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. గ్రామాల్లో వీధి కుక్కలను నియంత్రించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ వారు బాధ్యత రహితంగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పద్మమ్మ, బాధితుడి భార్య, హస్నాబాద్

మందులు ఉన్నాయి



వర్షాకాలం కావడంతో రైతులు పాము, తేలు కాటుకు గురవుతుంటారు. కానీ ప్రస్తుతం కుక్క కాటు కేసులు ఎక్కువయ్యాయి. ఎవరూ అధైర్య పడొద్దు. హకీంపేట్ ప్రాథమిక వైద్య కేంద్రంలో అన్ని ఔషధాలు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా కుక్క, పాము, తేలు వంటి కాటుకు గురైతే పీహెచ్‌సీని సంప్రదించవచ్చు.

– డాక్టర్ వందన, పీహెచ్‌సీ, హకీంపేట్

వరద పోటెత్తి.. వంతెన దెబ్బతిని


వరద ప్రవాహంతో నాగసముందర్ వైపు దెబ్బతిన్న వంతెన

ధారూరు: మండలంలోని రుద్రారం–నాగసముందర్ గ్రామాల మధ్య రోడ్డుపై నుంచి కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు పారడంతో సోమవారం వంతెనకు ఓ వైపు గండి పడి ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. కొన్నేళ్ల నుంచి కనీసం మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. వంతెనకు పడిన గండిని చూసి వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. వంతెన వద్ద వరదనీటి ప్రవాహం తగ్గిన వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేయించాలని, లేనిపక్షంలో ప్రవాహానికి కొట్టుకపోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు స్పందించాలని కోరారు.

డబుల్ ఇళ్లు పంపిణీ చేయాలని వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

షాద్‌నగర్: ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలని కోరుతూ సోమవారం పలువురు నిరుపేద మహిళలు పట్టణంలోని క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు అసంపూర్తిగా నిర్మించి వదిలేసిందన్నారు. డబుల్ ఇళ్లలో సౌకర్యాల కల్పనకు ఇటీవల నిధులు మంజూరు చేయిస్తే బకాయిల కింద జమైనట్లు తెలిపారు. దీంతో ఇళ్ల పంపిణీలో ఆలస్యం జరిగిందన్నారు. విద్యుత్, మంచి నీటి సౌకర్యం కల్పించాల్సి ఉందని, ఆ పనులు పూర్తవగానే లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం


ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

పరిగి: పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య అన్నారు. పురపాలక సంఘం వందరోజుల కార్యచరణలో భాగంగా సోమవారం పట్టణ కేంద్రంలోని 13వ వార్డు మందుల కాలనీలో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరువేరుగా వేయాలన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించడంతోనే ఎలాంటి రోగాల దరి చేరవన్నారు. ప్రభుత్వం ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తుందన్నారు. కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఆడిట్ ఓపెన్ ఫోరం


ఈజీఎస్ మండల స్థాయి ఓపెన్ ఫోరంలో జిల్లా అధికారులు, నాయకులు

బొంరాస్‌పేట: జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు చేపట్టిన పనులు, నిధుల ఖర్చు వివరాలపై సోమవారం బహిరంగ సభతో ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఇదివరకు చేపట్టిన సోషల్ ఆడిట్ నివేదికలను మండల పరిషత్ కార్యాలయంలో రోజంతా గ్రామ పంచాయతీల వారీగా నిధులు, ఖర్చుల వివరాలను తెలియజేశారు. నివేదికలను అధికారులకు సమర్పించారు. ఇందులో తెలంగాణ ఈజీఎస్ కోర్ కమిటీ సభ్యుడు నర్సింలుగౌడ్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఏపీడీ సరళ, అంబుడ్స్‌మెన్ జి.రాములు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, ఏబీఓ భార్గవి, ఏపీఓ ఇలియాస్, పీఎసీఎస్ జయకృష్ణ, గ్రామపంచాయతీల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

సీఐ భూపాల్‌శ్రీధర్


మాట్లాడుతున్న సీఐ భూపాల్‌శ్రీధర్

చేవెళ్ల: రాబోయే గణేశ్ ఉత్సవాలను అంతా కలిసిమెలసి శాంతియుతంగా జరుపుకోవాలని పట్టణ సీఐ భూపాల్‌శ్రీధర్ సూచించారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో సోమవారం సాయంత్రం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మండలంలోని గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేశ్ ఉత్సవాలను జరుపుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలు వివరించారు. మండపాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని, ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖకు మండపాల సమాచారం ఉంటే ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే అక్కడికి వచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. కావాల్సిన బందోబస్త్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరికీ ఇబ్బందులు కలిగించకుండా ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. డీజేల వాడకం పూర్తిగా నిషేధమన్నారు. ముందుగానే మండపాలకు సంబంధించిన అనుమతి కోరుతూ సమాచారం పోలీస్‌లకు అందించాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, ఎస్‌ఐలు సంతోష్‌రెడ్డి, తేజశ్రీ, శిరీష, సిబ్బంది ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం


ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్


సభ్యత్వ నమోదులో పాల్గొన్న విద్యార్థులు

షాద్‌నగర్: విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తున్నామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. సోమవారం పట్టణంలోని విజేత జూనియర్ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. భారత విద్యార్థి ఫెడరేషన్ విద్యార్థుల పక్షాన ఉండి పోరాటం చేస్తోందన్నారు. అందరికీ సమానమైన విద్యనందించాలని, విద్యార్థుల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం నిరంతం తాము పోరాటం చేస్తున్నామని వివరించారు. ఎస్‌ఎఫ్‌ఐలో సభ్యత్వం తీసుకోవడం అంటే.. ఒక ఉద్యమంలో భాగమై, సమాజంలో మార్పు తీసుకురావడానికి కృషి చేయమేనన్నారు. దీంతో సమాజంలో నెలకొన్న సమస్యలు, కుల వివక్ష, ఆర్థిక అసమానతలు, మతతత్వం వంటి సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకుంటారన్నారు. నాయకత్వ లక్షణాలను పెంపొందుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు ఆదిల్, సభ్యులు ప్రవీణ్, చరణ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం

మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌రెడ్డి


దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

చేవెళ్ల: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చేవెళ్ల మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలో సోమవారం పలు దుకాణాల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి పలు దుకాణాల్లో తనిఖీలు చేసి ప్లాస్టిక్ కవర్లను పరిశీలించి.. నిషేధిత కవర్లను స్వాధీనం చేసుకొని 12 వేల రూపాయల వరకు జరిమాన విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకంతో కలిగే నష్టాలను వివరించి.. ఇకపై ఎవరైనా ప్లాస్టిక్ వాడితే పెద్ద జరిమాన విధిస్తామని హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.

పాపన్న పోరాటం స్ఫూర్తిదాయకం

బహుజనులను ఏకం చేసి గోల్కొండ కోటపై పాగా వేసిన సమరయోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాటం స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం ఆయన జయంతి సందర్భంగా విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆధిపత్య వర్గాలపై పాపన్నగౌడ్ ఉద్యమం భావితరాలకు ఆదర్శమని నేతలు మననం చేస్తున్నారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్


తాండూరు రూరల్: కరన్‌కోట్‌లో పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గీత కార్మికులు


తాండూరు టౌన్: పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మహేందర్ రెడ్డి


మర్పల్లి: కొంషెట్‌పల్లిలో విగ్రహానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు


దౌల్తాబాద్‌లో సర్వాయిపాపన్న జయంతిలో పాల్గొన్న నాయకులు


వికారాబాద్‌లో పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం జిల్లా నేతలు


బంట్వారం: పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నేతలు


తాండూరు టౌన్: విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గీత కార్మికులు


బొంరాస్‌పేట: కొత్తూరులో..


కుల్కచర్లలో విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు


పరిగి: సర్వాయి పాపన్న జయంతిలో నాయకులు


దుద్యాల్: కుదురుమల్లలో

గణేశ్ నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించాలి

మర్పల్లి ఎస్‌ఐ ఎండీ రహూఫ్

మర్పల్లి: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల నుంచి అనుమతులు తీసుకోవాలని మర్పల్లి ఎస్‌ఐ ఎండీ రహూఫ్ పేర్కొన్నారు. సోమవారం మర్పల్లి పీఎస్‌లో ఆయన మాట్లాడుతూ.. వినాయక చవిత పండుగ సందర్భంగా ప్రతిమల ఏర్పాటు, ఊరేగింపు, నిమజ్జన కోసం ముందస్తుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇందుకు తెలంగాణ పోలీస్ విభాగం ప్రత్యేకంగా ఓ పోర్టల్‌ను రూపొందించిందన్నారు. మండపాల వద్ద విద్యుత్ సరఫరా కోసం ముందస్తుగా ఆ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ స్థలాలు ఉంటే యజమాని నుంచి అనుమతి తీసుకున్నట్లు లిఖిత పూర్వకంగా ఇవ్వాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. పోలీసులకు సహకరించి గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.

వంతెన నిర్మించాలని వినతి


వాగు దాటుతున్న విద్యార్థులు

కేశంపేట: మండల పరిధిలోని పాటిగడ్డ గ్రామ శివారులో ఉన్న వాగుపై వంతెన నిర్మించాలని కోరుతూ తహసీల్దార్ అజాంఅలీ, ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్యకు డీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో పాటిగడ్డ వాగు నిండుగా ప్రవహించినప్పుడు గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు వ్యవసాయ పొలాలకు, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేని దుస్థితి ఏర్పడుతోందన్నారు. అధికారులు, నాయకులు స్పందించి వాగుపై బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో రవి, శివ, శ్రీకాంత్, కృష్ణ, నర్సింహ, శ్రీకాంత్, కృష్ణ, రాజు, కుమార్ పాల్గొన్నారు.